# పుట్టి మునిగింది

అది ఓ టౌన్ సెంటర్‌లో ఉన్న గ్రీన్‌ల్యాండ్ హాస్పిటల్. సెప్టెంబర్ నెలలో ముసుర్ల వల్లనైతేనేం, చల్లగాలుల వల్లనైతేనేమి వాతావరణం మారి ఓ మాదిరి విషజ్వరాలు వస్తున్నాయి. దావఖానలో రోగుల రద్దీ ఎక్కువ ఉంది. గ్రీన్‌ల్యాండ్‌లో అదే పరిస్థితి. జనం కిటకిటలాడుతున్నారు. చిన్న చిన్న ప్లాస్టిక్ గ్లాసుల్లో ఛాయ అందిస్తున్నాడు ఓ కుర్రాడు.

వేగంగా అప్పుడే ఓ సుమో హాహాకారాల నడుమ గొల్లుమంటు ఓ గుంపుతో వచ్చి ఆగింది. అందులో నుండి ఇద్దర్ని దింపుకుని ఆసుపత్రిలోపలికి తీసుకొచ్చిండ్రు. వల్లంత రక్తపు మరకలు. నెత్తురోడుస్తున్న గాయాలు, లబోదిబో మంటున్న బంధువులు.

" పుష్కరాలు పాడుగాను ప్రాణం మీదికి తెచ్చుకున్నారు " అంటు ఏడుపులు. ముక్కు చీదుళ్ళు.

" ఏం జరిగింది "

" లారీ, కారు గుద్దుకొని, కొందరు అక్కడికక్కడె చనిపోయిండ్రు. ఈ ఇద్దరు ప్రాణాలతో వుండగా తీసుకొచ్చినం " అన్నరు. హాస్పిటర్ సిబ్బంది లోపలికి తీసుకెళ్ళిండ్రు. ప్రథమ చికిత్స జరిపి, 'నిమ్స్‌కు తీసుకెళ్ళమని సలహా ఇచ్చాడు' డాక్టర్.

అదే సుమో హైద్రాబాద్ వైపు పరుగెత్తింది. వాళ్ళు వెళుతున్న వైపు చూస్తున్న కంపౌండర్ " ఏం పుష్కరాలో ఏమో బతకాలని దేవుని దగ్గరికి పోయే జనం చావును కొనితెచ్చుకుంటరు" అన్నడు

*

నలుబదేండ్ల వ్యక్తి, తన భార్య బుజాలు పట్టుకొని నడిపిస్తూ తీసుకొచ్చి వరుసలోకూర్చోపెట్టి తాను పక్కన్నె కూర్చున్నాడు. భర్త రమణ భార్యను జాలిగా చూస్తు

" ఏమైంది " అంటు అడుగుతు దగ్గరగా వచ్చి చూసింది రిసెప్షన్‌లో ఉన్న నర్సు.

“ నిలకడలేని చూపులు, తనలో తానే నవ్వుకోవడం చేస్తువుంది” అన్నడు భర్త ఆమెవైపు ఆందోళనగా చూస్తువున్నడు. ఆమె భర్తవైపు చూస్తు ఓ మాదిరి నవ్వు. నర్స్ ఆమెను సమీపించి పేరు వయస్సు అడిగింది.

“ వనజ, ముప్పైఐదు” అన్నడు భర్త. వివరాలు రాసుకొని మానసిక వైద్యుని గది ముందు తీసుకెళ్ళి కూర్చో పెట్టింది. బెల్ మోగింది రమణవైపు చూస్తు తీసుకెళ్ళమని సైగ చేసింది. రమణ విచారంగా భార్యను తీసుకొని లోపలికి నడిచిండు.

‘ ఆమె కూర్చుంది. డాక్టర్ స్టూలు చూపించాడు. రమణ పక్కన్నె నిలుచున్నాడు

ఆమె కనురెప్పలను నాలుకను పరీక్షించి,

ఏదో ఆలోచించిన డాక్టరు నర్సును పిలిచి ఈమెను పక్క గదిలో కూర్చోబెట్టండి అన్నడు.

“ ఏమిటి సమస్య ” అంటు రమణవైపు చూసాడు డాక్టర్.

“ రోజు స్నానం ముగించుకొని, తలకు తుండుగుడ్డ చుట్టుకుని, మెడకిందచందనం అద్దుకుని పూజగదిలోకి వెలుతుంది. కృష్ణ విగ్రహం ముందు దీప దూపాలు వెలిగిస్తుంది. ఆ తరువాత తలుపులు మూసుకొని గంటలకొలది ఆ గదిలోనే గడుపుతుంది. ఓ రోజు తలుపులు మూసుకొని గడియ వేసుకోలేదు.నేను తెరిచి చూదును కదా ఊహించని దృశ్యం! వంటిమీద నూలుపోగులేదు. వెలికల పడుకుని కళ్ళుమూసుకొని కలవరిస్తావుంది. ఆ సమయంలో ఆమె అనే మాటలను వినలేం” అని కాసేపు ఆగాడు రమణ డాక్టర్ ముఖంలోకి చూస్తు.

“ ఋతు క్రమం సరిగ అవుతుందా? రాత్రిపూట నిద్ర సరిగా పడుతుందా? నలుగురితో నిర్భయంగా మాట్లాడుతుందా? సంగీతాన్ని సాహిత్యాన్ని ఇష్టపడుతుందా? వేళకు తిండి సరిగా తింటుందా? ఈమె దినచర్య ఏమిటి? మీతోఎలా మెసులుతుంది.” ఆమె వైపు మరోసారి చూస్తు రెండు వేళ్ళను చూపించి “ ఇది ఎన్ని ” అడిగాడు. ఆమె మాట్లాడలేదు. భర్తవైపు చూసి నవ్వింది.

“ ఆమె మానసిక స్థితి తెలవాలంటే ఆమె మాట్లాడే మాటలు, మాట్లాడే తీరు, తీవ్రతను గమనించవల్సి ఉంది. అందుకని ఈ రోజు ఈమెను మా పరిశీలనలో ఉంచండి” అన్నడు డాక్టర్.

‘ సరె ’ అన్నడు రమణ

" డాక్టర్ ఆమెను పక్కగదిలో ఒంటరిగా ఉంచిండు."

" ఆ గదిలో ఆమె ఒక్కతే " నర్స్ కొన్ని కాగితాలను రంగు పెన్సిల్లను తెచ్చి ముందుంచింది.

" అవె బెదురు చూపులు, అవె కలవరింతలు. అన్నీ కాగితాలమీద అస్తవ్యస్తంగా గీతల రూపంలో రూపుదిద్దుకుంటు ఉన్నాయి. పారే నీరు ఆ నీటిలో మునిగి తేలె మనుషుల బొమ్మలు. ఆ బొమ్మలకు బట్టలు లేవు. అవి ఆమె గీస్తున్న గీతలు.

అట్లా ఆ పూట గడిసింది. సాయంత్రం ఆమెకు ఇవ్వవలసిన మందులిచ్చి స్పందనను రికార్డు చేసారు.

డాక్టర్ ఆ గదిలోకి వెళ్ళి ఆ కాగితాలను పరీశిలించి, " బయట బెంచిమీద కూర్చోబెట్టు " అని చెప్పి, ఆయనను తనతో రావల్సిందిగ సైగచేసాడు.

ఇద్దరు కూర్చున్నాక, భర్త ఆందోళనగా డాక్టర్‌వైపు చూసున్నడు.

" ఏంలేదు ఆమె మానసికంగా కాస్త డిస్టర్బ్ అయింది. అందుకే ఆ ఫిట్స్ రావటం. ఏంకాదు" అన్నడు డాక్టర్.

భర్త మౌనంగా వింటున్నపుడు ఆయన కళ్లలో నీరు తిరిగి, ఎదలోని బాధ నిట్టూర్పుగా బయటికొచ్చింది.

" ఎంతో ఆరోగ్యంగా ఉన్నామే ఎందుకిట్లా అయ్యిందో, సంతానం కలగలేదని కొంత బాధపడుతు ఉండేది. అందుకని ఆమె ఏది కోరినా తక్షణమే సమకూర్చేవాడిని " అన్నడు రమణ. దు:ఖాన్ని దిగమింగుతు

" సంతానం కాక పోవడానికి చాలా కారణాలు ఉంటాయి. కనుక్కుని తగు చికిత్స చేయిస్తే సరిపాయే, ఆవిషయం తరువాత చూద్దాం. ముందు ఈమెకు ఇప్పుడు ఇవ్వవలసిన ట్రీట్‌మెంట్ ఇద్దాం." అన్నడు డాక్టర్.

" సకాలంలో సంతానం కలిగితే ఈలాంటివి రావు సుమా " అన్నడు డాక్టరు.

" ఇరువైఏళ్లు ప్రశాంతంగానే ఉంది. " అన్నడు భర్త తన్నుకొస్తున్న కన్నీళ్లను కర్చిప్‌తో అద్దుకుంటు, ఈ పుష్కరాలకు పోయిన్నుండే ఇట్లా చేస్తుంది." అన్నడు రమణ.

" పుష్కరాలకు పోయారా అదే మీరు చేసిన పొరపాటు. సమూహ స్నానాలు, కొత్త వాళ్లతో పరిచయాలు, సున్నితమైన మనస్తత్వం మీద పనిచేసి పరేషాన్ చేస్తయి " అన్నడు డాక్టరు మెడలోని స్టెతస్కోప్‌ను మలిచి

టేబుల్‌మీదుంచుతు.

" నేను వద్దెవద్దన్న డాక్టర్ ఆమే పోదాం అని పట్టుబట్టింది. కాదనలేకపోయిన " అన్నడు భర్త.

" జరిగిందానికి విచారిస్తు కూర్చుంటె లాభంలేదు. జరగబోయేదాన్ని ఆలోచించాలి. మందులు రాసిస్తాను వాడి చూడండి " అంటు మందులు రాసి చీటి చేతికిస్తూ మీరు కూడా ఆమెను మానసికంగా సంతోషంగా ఉంచాలి. గతంలో కంటె ఎక్కువ సమయం గడపాలి. ఆమె కట్టుబొట్టును, నవ్వు నడకను పొగుడుతు ఉండాలి. ఆమె ఊహాలకు తగ్గట్టుగా మీరు కనపడాలి. ఒంటరిగా ఉండకుండా చూడాలి. ఆమె కోర్కెలను మీరు స్వాగతిస్తుండాలి. మనస్సుకు కోర్కెలు ఉన్నట్టె శరీరానికి కోర్కెలుంటయి. వాటిని మీరు ఎప్పటికప్పుడు తీర్చుతూ తృప్తి కలిగించాలి. ఇంకా ఆమె కోలుకోకపోతే మరో పని చేయాలి. మీ బంధువులకు సంబంధించిన ఓఆడపిల్లను పెంచుకోండి. కొంత మార్పురావచ్చు మీరు ఇంట్లవున్న ఆమెను జనంలోకి తీసుకెళ్లి పరేషాన్ చేసింద్రు. పుష్కరాలంటే ఎంత గోల.!

" నేను ఓసారి స్నేహితుల బలవంతం మీద గోదావరి పుష్కరాలకు వెళ్లుదునుగదా. అక్కడ అంతా జాతర.
చెరువులో వొదిలిన బతుకమ్మ చెదిరి పూలన్నీ చిందర వందరగా తేలాడుతున్నట్లు పుష్కరాల ఘాట్లలో జనం. ఆడమగ పిల్లలు అందరు కలిసి స్నానం చేస్తువున్నరు. వయస్సు తేడా లేదు. వంటికి అంటుకుపోయి పైకెత్తి పట్టుకున్న వస్త్రధారణ. భక్తి సంగతి నీల్లెరుగు అంతా బరి బత్తలే, బహిరంగమే. పుష్కరాలలో మునిగితే పుణ్యమొస్తదని పోయినోళ్ళకు పిండాలు పెట్టి పేర్లు ఉచ్చరిస్తే వాళ్లు వచ్చి తింటర? కష్టఫలం నీటిపాలే! అవును ఇది పూర్వం నుండి వస్తున్న ఆచారమె కావచ్చు. ఆరోజుల్లో నదులు కొండల్లో పుట్టి మైదానాలు దాటి, రాళ్ళు బోళ్లల్లో చెట్లు చేమలను పెకిలిస్తు రావటం వల్లా ఔషదపు గుణాలను మోస్తుకొస్తుండేవి. ఆరోజుల్లో ఏకొద్దిమందో వెళ్ళి నదిస్నానాలు చేసేవాళ్లు. అట్లా మూలికల నీళ్లల్లో స్నానం చేయడం వల్లా ఏదేని అనారోగ్యపు లక్షణాలు ఉంటే తొలిగిపోయేవి. అందుకని అప్పట్లో నదిజలాలు పవిత్రం అన్నరు ఇప్పుడు నదులన్నీ కలుషితం కావడమో కాకుండా, వర్షాలు రాక వరదలు లేక నదులు కాలువల్లా పారుతున్నయి. మునిగె జనం లక్షలకు లక్షలు. వెంటనే తిరిగొచ్చేసాను. " అని ముగించిందు డాక్టర్.

రమణ చీటితో బయటికొచ్చి భార్యవున్న గదిలోకి వెళ్ళి చూసె సరికి, ఆమె గోడకున్న క్యాలండర్‌ను రెప్పగొట్టకుండా చూస్తునిలుచుంది. దానిలో చెట్టుకొమ్మమీద కృష్ణుడు. ఎదురుగా నీటిలో స్త్రీలు తన రాకను కూడా గమనించలేకపోయింది. ఆమెనట్లా చూసెసరికి బాధ కలిగింది. ఆమె చేయి పట్టుకొని కదిలిస్తు డాక్టర్ మందులు రాసాడు. మందులు వాడితే బాగ అవుతది. పద పోదాం " అన్నడు.

" మౌనంగా ఆమె నవ్వుతు అక్కడ నుండి కదులుతు భర్త బుగ్గలను ఓసారి తాకి నవ్వి కదిలింది. వెనకాల భర్త.

బయటికొచ్చి ఆటోలో కూర్చున్నరు. ఆటో కదిలింది. ఆయన తలలో ఆలోచనలు కదిలి, ఆరోజు గుర్తొచ్చింది.

కృష్ణా నీటిలో ఇద్దరు మునిగారు. చుట్టూ మునుగుతువున్న ఆడమగ జనం. ఒకరికి ఒకరు వొరుసుకునెంత దగ్గరితనం. ఇద్దరు మునిగొచ్చి గట్టుకు చేరినంకా ' అమ్మ-నాన్నలకు పిండాలు వదిలి వస్తాను' అంటు తాను బ్రాహ్మనులున్నవైపు నడుస్తు వెనుక్కు చూసాడు రమణ. ఆమె తడిబట్టలు శరీరానికి అత్తుకుపోయి తలనుండి మొలమీదుగా పాదాలమీద రాలుతున్న నీటిచుక్కలు. రెప్పకొట్టకుండా చూస్తున్న అపరిచిత వ్యక్తి ఎదురుగా. అతను ఇందాక తమ పక్కమ్మటె నీట మునిగిన ఆజానుబాహుడు. అతని మనస్సులో ఆమె రూపురేఖలు. రూపుదిద్దుకుంటున్నట్లు అతని చూపులు చెపుతున్నాయి. అతని విశాలమైన ఎదమీద ఆమె చూపులు నిలిపినట్టుంది. అది ఎద కిందికి మీదికి కదులుతువుంది.

ఓప్ ఎంత అందమైన స్త్రీ. అనుకుంటున్నట్టు కళ్ళు రెప్పలుకొట్టడం మానేసాడు కాసేపు. మననులో నిలువెత్తు అందం పోత పోసుకుంటువుంది.

నేలమీద ఆమె పాదపు బొటమన వేలుతో తన మనసులోని భావానికి రూపాన్ని గీస్తున్నట్టుంది. అదిచూసిన అతనికి మొదట సిగ్గు అనిపించిందో ఏమో ఆ తరువాత తనకుతాను సంబాలించుకుని ' ఈ శృంగార తరంగాలు ఆది నుండి ఉన్నయే! ఒకరినొకరు రెచ్చకొట్టే మన్మదభాణాలు అన్నీ మన సంస్కృతిలోని వర్ణ చలన చిత్రాలే! మరి నేను ఆ సంస్కృతికి వారసున్నేకదా?' ఆమె వర్షంలో తడిసిన దిర్శరావులా వుంది. అనుకుంటు ఆమెను కాసేపు తనవితీర చూస్తుండి పోయిండు.

" ఆమె చూపులు అతని చూపులకు తగిలినపుడు భయం వణికిస్తుందేమో

ఆమె చేతులు చెంపలకుతాకుతున్నాయి. అప్పుడు గాలికి పూరేకులు కదిలినట్టు అనిపిస్తుంది. గుంపులు గుంపులుగ జనం. గుంపులో గోవింద. గట్టిన ఎత్తు వంపుల అంగ సౌష్టవంతో అందమైన పుష్కరాల విగ్రహం. ఈమెను చూసి దానిని మలిచిందా లేక ఈమె అక్కడ నిలుచుందా కాసేపు అనుమానపు ఆలోచనతో ఓసారి చుట్టు చూసిండు. తానుకాక ఇంకాకొంతమంది ఆమెనే చూసేది గ్రహించి చికాకు గురైనాడు. అసహనంగా కదిలిండు.

ఇద్దరిని కొత్తగాలి ఉక్కిరిబిక్కిరి చేసిందేమో ఎవరి శరీరం మీద ఇంతకుముందున్న నీటిబొట్లు లేవు. అప్పుడు ఆమె తన చూపులను నేల మళ్లించి, ఆలోచనలు అదుపుచేసుకుంది. ఎంతైనా తాను భూమి అతను తిరుగుతున్న బొంగరం. తాడేమో చుట్టువున్న సుందరం తట్టుకోలేక మరొకసారి నీటిలో మునిగొస్తు వుంటె ఆమె ఎదమీద పుస్తే తలుక్కున మెరిసింది. అతనిలోని మనిషి మేల్కోగ అక్కడి నుండి కదిలి. పిండాలు పెట్టెవైపు నడిచిండు. అప్పుడు అతని మనస్సు పూర్వికుల వైపు మళ్ళింది.

" బ్రాహ్మణుడు ఎదురై మీపేరు అని" అడిగిండు. ఆ అడిగినాయన పదిహేనుఏండ్ల బాలుడు ఎన్నేండ్లేన్నది కాదు ప్రధానం బ్రాహ్మణుడైతే సరిపోత. ఆహోదాలోనే పేరు అడిగిండు. అది తరతరాల నుండి వస్తున్న రిజర్వేషన్ కదా?

" మోహన్ " అని చెప్పిండు.

తండ్రిపేరు అనగానే అది చెప్పాడు. గోత్రం అది చెప్పగానే వాటినే ఉచ్ఛరిస్తు పిండప్రదానం కోసం ముందుకు నడుస్తున్నడు. వెనకాల మోహన్. అతని మనసు నిండా సిగ్గుతోకూడిన తలంపులు.

రమణ ఓసారి వెనుకకు తిరిగిచూసిండు. ఇందాకటి ఆ ఇద్దరి స్థితిగుర్తొచ్చి తనను తాను తిట్టుకున్నాడు. ఈలాంటి సంప్రదాయాన్ని మోసుకొస్తున్న వాళ్లను తిట్టాడు. భక్తి పేరుతో బరితెగించిన దృశ్యాలా!

మోహన్‌కు తన పూర్వికులు తన వరకు, తీసుకొచ్చి వదిలిన వారసత్వపు సంస్కృతి మీద రకరకాల ఆలోచనలు చోటు చేసుకుంటున్నాయి. పబ్‌ల్లో, క్లబ్‌ల్లో నాచ్, గానాలను విపరీతం అంటున్నం. విదేశీ సంస్కృతి అని ముక్కుమీద వేలేసుకుంటున్నం. మరీ ఈ అర్ధనగ్న సమూహస్నానాలు? జాతర్లలో చోటుచేసుకునే విచ్చలవిడి తనం! ఈ ప్రదర్శనలు ఉన్నంతకాలం పరేషాని తప్పదు. కనిపిస్తే కావాలనుకోవటం అందితే పొందాలనుకోవటం,

కండ్ల సంబూరంతో సరి పెట్టుకోలేక పోతున్నరు. ఆమె కొన్ని క్షణాలు ఎంత కలవరపరిచిందో అనుకుంటు నడుస్తుంటే పాదాలకు లోతు తగిలింది. ఆగి మరొకసారి మునిగి తేలిండు మోహన్. సరిగ్గా అప్పుడే పుష్కర శ్లోకాలు మైక్‌లో వినిపిస్తున్నయి. జనం చేతులు జోడించి నీటిలో మునిగితేలుతువున్నరు.

పెద్దలకు పిండప్రధానం జరుగుతున్నంత సేపు రమణ కళ్ళు వాళ్ళనె గమనిస్తువున్నయి. భక్తితో చాలా మంది మునిగి తేలుతున్నారు. వాళ్ళతోపాటు కొన్ని విచిత్ర సంఘటనలు! విలువలు నీటకలుస్తున్న గడియలు! అనుకుంటు ఉండగా ఆటో ఇంటి ముందాగింది. అతని ఆలోచనలు తెగిపోయినయి.

‘ పుష్కరాలలో కొంపమునిగింది’ అనుకుంటు ఆటోదిగి భార్యను నడిపించుకుంటు రమణ లోపలికి నడిచిండు. ఇంట్లోకి పోగానే అత్త ఎదురొచ్చి ‘ ఏందంట ’ అని అడిగింది.

ఆమె భర్త చేతుల్లో నుండి కిందకు జారి తల పట్టుకొని కూర్చుండి పోయింది. మూసుకున్న ఆమె కళ్లలో స్నానపు గుర్తులు. పెదాలు దాటి వస్తున్న కలువరింతలు! వణుకుతున్న పెదవులు.

“ దీనికెదో గాలి తగిలినట్టుంది ” అసలే గొర్రాలు. దానికితోడు ఇదోపిచ్చి. నీ దారి గోదారె” నాయనా అంటు కొడుకును కోదలిని చూస్తు చేతులను తిప్పుతు వెటకారంగ అంది తల్లి.

“భార్య అమాయకంగా భర్త ముఖంలోకి చూసింది. ”

రమణ శూన్యంలోకి చూస్తుండి పోగా అతని కళ్ళ నిండా సుడులు తిరుగుతున్న కన్నీళ్ళు.

● సెప్టెంబర్ 2004

* విపుల 2005.